# న్యాయం

ఆధునిక సమాజంలో చట్టబద్ధతనే 'న్యాయం' అని వ్యవహరిస్తుంటారు. ప్రజలు చేసిన తప్పులకు వారికి జుల్మానా విధించినా, లేక వారికి కలిగిన నష్టాలకు పరిహారం లభించినా వారికి న్యాయం జరిగినట్లే అయితే, బైబిల్లో న్యాయం అంటే మోషే ధర్మశాస్త్రానికి సంబంధించిన న్యాయమే. ఇశ్రాయేలు ప్రజల సంరక్షణకు వారి శ్రేయస్సుకు యెహోవా యిచ్చిన కానుక ఈ ధర్మశాస్త్రం. అయితే, దేవుని న్యాయం అక్షరాలా ఆజ్ఞను పాటించడం మాత్రమే కాదు. అన్ని సంబంధ బాంధవ్యాలు సరిగా వుండడమే ఈ ధర్మశాస్త్రం ప్రధాన ఉద్దేశం. యిక్కడ ఒక సమకాలీన ఉదాహరణ చూద్దాం. ఒక పరిశ్రమ నుంచి వెలివడే పారిశ్రామిక వ్యర్థపదార్థాలు దగ్గర్లో ఉన్న ఒక నదిలోనికి ప్రవహిస్తున్నాయనుకోండి. పరిశ్రమ యాజమాన్యం చట్టపరిమితులకు లోబడే ఈ వ్యర్థపదార్థాలను నదిలోనికి విడిచిపెడుతుండవచ్చు. అయినా ఎంతో కొంత మేరకు విషపదార్థాలు నదిలో కలుస్తూనే వుంటాయి. ఈ పరిశ్రమ యాజమాన్యం చట్టానికి లోబడుతూనే వుంది. యితే, పర్యావరణానికి గాని నదీజలాల నుపయోగించే ప్రజలకుగాని ఈ పరిశ్రమ వలన మేలు కలుగుతుందంటారా?

బైబిలు ప్రకారం, కేవలం చట్టానికి లోబడటమే న్యాయం కాదు. న్యాయం అంటే ప్రేమను శ్రద్ధాసక్తులను కనబరుస్తూ సరైన సంబంధ బాంధవ్యాలులో జీవించడం. న్యాయం దేవునిది. న్యాయం ఆయన నుంచి ప్రారంభమౌతుంది. అవధుల్లేని దైవప్రేమలో న్యాయం వుంది.సర్వదృష్టికి ఆయన న్యాయాన్ని జరిగిస్తాడు (కీర్తన 9:7-9). దేవుని న్యాయానికి సజీవ సాక్ష్యాలుగా వుండేందుకు ఆయన ఇశ్రాయేలు ప్రజలను ఎన్నుకొన్నాడు (ఆది 12:1,2: ద్వితీ 10:17-19: యెషయా 1:16,17: హోషెయ 10:12).

క్రొత్త నిబంధనలో,దేవుని అపారమైన ప్రేమలోంచి న్యాయం ఎలా వస్తుందో అపొస్తలుడైన పౌలు వర్ణించాడు. బీదవారి పట్ల అనవరతల్లో ఉన్న వారి పట్ల (2కొరింథీ 9:7-11) దేవుని ప్రజలు చూపే ప్రేమలోంచి న్యాయం జాలువారుతుంది. ఏ ఆజ్ఞ ప్రాముఖ్యమైనదనే ప్రశ్నకు జవాబుగా ఆయన దేవుని న్యాయం గురించి నొక్కి వక్కాణించాడు. మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు. నీవు నీ పూర్ణ హృదయంతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ వివేకముతోను, నీ పూర్ణబలంతోను, నీ దేవుడైన ప్రభువును ప్రేమింప వలెననునది ప్రధానమైన ఆజ్ఞ. రెండవది. నీవు నిన్నువలే నీ పొరుగువారిని ప్రేమింపవలెనని రెండవ ఆజ్ఞ (మార్కు 12:29-31:లెవీయ 19:18) భూమిమీద తన పరచర్య ఉద్దేశాన్ని యేసు ప్రకటించినప్పుడు ఆయన పలికిన మాటలు: బీదలకు సువార్త ప్రకటించుటకై - పంపియున్నాడు

(లూకా 4:18: యెషయా 61:1,2). న్యాయం ద్వారా ప్రజలందరికీ భద్రత స్వేచ్ఛ లభిస్తాయి. మనిషి అవసరాలన్ని న్యాయంగా తీరినప్పుడు వారు బాధావలయం నుంచి అనవరతల నుంచి విడుదల పొందుతారు.

దేవుని రాజ్యంలో న్యాయం చాలా ముఖ్యమైనది. దేవుని ప్రజలు యితరులతో తమ వ్యవహారాల్లో న్యాయంగా వుండకపోతే వారి ప్రార్థనలు వారి భక్తి అర్థం లేని (యెషయా 1:10-17: యిర్మీయా 9:23,24: అమోను 5:21-24). దేవుని ప్రజలందరూ న్యాయం జరిగిస్తూ వుండాలి. కానీ, అధికారంలో వున్నవారు ధనవంతులు మరి ఎక్కువగా దేవుని న్యాయానికి సజీవ దృష్టాంతాలుగా వుండాలి (2నమూ 8:15: కీర్తన 45:6,7: సామెత 16:12 యిర్మీయా 21:11,12). అధికారాన్ని డబ్బును అడ్డం పెట్టుకొని యితరులను దోచుకొనేవారి మీదకు యెహోవా తీర్పు వస్తుంది (అమోను 2:6-8). అంటే దేవుని న్యాయం వలన అన్యాయస్థులకు నష్టమే కలుగుతుంది. నిరుపేదలకు దీనులకు దళితులకు న్యాయం జరగాలంటే, వీరి పట్ల అన్యాయంగా ప్రవర్తించినవారు తగిన మూల్యం చెల్లించవలసిందే (అమోసు 5:10-15: లూకా 1:51: లూకా 1:51-53:6:20-25).